క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరామర్శ


పరామర్శలో తిలక్ తదితరులు

సంతబొమ్మాళి: లక్కివలస సర్పంచ్ శ్రీరంగ స్వామి తల్లి అంకమ్మ, కాపు ఉమిలాడలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దుక్క అప్పారావు ఇటీవల చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈయనతో పాటు పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, పార్టీ నాయకులు మేరుగు అప్పారావు, కె.సతీష్, ఎం.నాగభూషణరావు, సవరయ్య, కొండయ్య, చింతడ రాజులు, మంకు గారయ్య, డొక్కరి నీలకంఠం ఉన్నారు.

కొండచిలువ మృతి


చనిపోయిన కొండచిలువ

సంతబొమ్మాళి: నౌపడ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో సుమారు 12 అడుగుల కొండచిలువ గుర్తు తెలియని వాహనం కింద పడి శనివారం ఉదయం ప్రాణాలు కోల్పోయింది. సమీప పొలాల నుంచి రోడ్డుపైకి వచ్చే క్రమంలో వాహనం దానిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

పోలీసు సిబ్బందికి సత్కారం


సత్కారం పొందిన పోలీసు సిబ్బందితో జేసీఐ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ప్రజా సేవలో నిత్యం నిమగ్నమవుతున్న పోలీసు సిబ్బంది స్వచ్ఛంద సంస్థ జేసీఐ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. సైలెంట్ స్టార్స్ పేరుతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పి.రంజిత్, ఎం.అప్పారావు, బి.అనూష, సీహెచ్ సురేష్, మైత్రి సిబ్బంది సోమేష్‌లను ఎస్సై ముకుందరావు చేతుల మీదగా దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ డైరెక్టర్ ఈశ్వర్, హెచ్‌సీఎఫ్ మోహన్‌వెంకటేష్, జేసీఐ ప్రతినిధులు జయదేవ్, షణ్ముఖ, స్వరూప్ వెచ్చా రాము, డిల్లేష్, సంతోష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సర్దార్ లచ్చన్నకు ఘన నివాళి


కంచిలి: లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు

కంచిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జి.వీరభద్రస్వామి పాల్గొన్నారు.

సోంపేట: స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని సోంపేటలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బి.అశోక్, మాజీ ఎమ్మెల్యే జి.శివాజీ నివాళులర్పించగా.. పలాపురంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పించారు. 55 మంది పదవతరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు.

వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడులో ఎంపీడీవో ఎస్. రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. నాయకులు సూరాడ మోహనరావు, మాజీ సర్పంచ్ సైని భాస్కరరావు, పుచ్చ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైతన్నా..జాగ్రత్త..!



- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు
- అప్రమత్తత తప్పనిసరి
- సూచనలిస్తున్న అధికారులు

సోంపేట:

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖాధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో విద్యుత్ వినియోగంపై ఏమాత్రం అశ్రద్ధగా ఉన్నా ప్రమదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు. ప్రమాదాలు అరికట్టాలంటే వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.


సోంపేట విద్యుత్ సబ్‌స్టేషన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు కూడా విద్యుత్ ప్రవహించే అవకాశం ఉంటుంది. అందువలన వ్యవసాయ బోరు బావులు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి. ఇళ్ల పైనుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు ఉంటే వర్షం కురిసే సమయంలో ఇంటిపైకి వెళ్లకపోవడం మంచిది.
- ఇంట్లో వాడే గృహ ఉపకరణాల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్‌శాఖాధికారులు తెలియజేస్తున్నారు. తడి చేతితో స్విచ్‌లు వేయడం వలన విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. తడి చేతితో స్విచ్‌లు వేయడం మంచిది కాదు.
- వర్షాలు కురుస్తున్నప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి పశువులు మృత్యువాతకు గురవుతున్నాయి. ఈదురుగాలులు వీచేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు తెగి పడే అవకాశం ఉంది.
- వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు రావడం, విద్యుత్ వైర్లు తెగడం జరుగుతుంది. కొన్ని సమయాల్లో రైతులు, స్థానికులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ షాక్‌కు గురవుతుంటారు. అటువంటి సమస్యలు వచ్చినప్పుడు విద్యుత్‌శాఖాధికారులు సమాచారం అందజేయాల్సిన అవసరం ఉంది. అప్రమత్తంగా లేకపోతే విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ వినియోగంలో అప్రమత్తంగా లేకపోవడంతో గత రెండు, మూడు సంవత్సరాల్లో మామిడిపల్లి, పాత్రకొండ, కర్తలిపాలేం గ్రామాల పరిధిలో ముగ్గురు రైతులు వ్యవసాయ బోరు బావుల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.
- బోరు మోటార్లు వినియోగించేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలి. స్టార్టర్ వద్ద తీగలు సరిచూసుకోవాలి. తెగిపోయి పొలాల్లో వేలాడే తీగలను ముందే గుర్తించాలి. తెగిన తీగలు ముట్టుకుంటే విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. స్టార్టర్ బాక్స్‌లను సురక్షిత ప్రాంతంలో ఉంచాలి. బోరు బావుల వద్ద ఎటువంటి సమస్య ఉన్నా విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.


వ్యవసాయ బోరుబావు వద్ద నీరు వదులుతున్న రైతులు

సమాచారం అందించాలి



విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే విద్యుత్‌శాఖాధికారులకు సమాచారం అందజేయాలి. వర్షాకాలంలో విద్యుత్ వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. బోరుబావుల వద్ద ఎటువంటి సమస్యలు ఉన్నా గ్రామస్థాయి విద్యుత్ అధికారులకు తెలియజేయాలి.

– జి.రామారావు, ఏఈ, విద్యుత్‌శాఖ

అధికారులు పరిశీలించాలి



గ్రామాల్లో వ్యవసాయ బోరు బావుల వద్దనున్న విద్యుత్ లైన్లు గ్రామస్థాయి విద్యుత్ శాఖాధికారులు వర్షాకాలంలో తరుచూ పరిశీలించాలి. ఎటువంటి సమస్యలున్నా రైతులకు సమాచారం అందజేయాలి. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలి. బోరుబావుల విద్యుత్ వినియోగంపై రైతులకు సలహాలు, సూచనలు అందజేయాలి.

– పోకల హేమరాజు, రైతు, జింకిభద్ర

వాటర్ ప్రాజెక్టు కార్మికుల నిరసన



ఉద్దానం వాటర్ ప్రాజెక్టులో 27 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు శనివారం కాశీబుగ్గ మహాత్మగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మెగా కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అకారణంగా తమను విధుల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా 132 మంది కార్మికుల్లో 105 మందిని విధుల నుంచి తొలగించారని ఆందోళన చెందారు. వారి నిరసన కార్యక్రమానికి ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు గొరకల బాలక్రిష్ణ, రామక్రిష్ణ, జగన్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ రూరల్ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ నేతలు కె.నీలాచలం, కె.రాజశేఖర్, బి.జోగారావు, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు. – పలాస

‘కిడ్నీ ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న డి.గోవిందరావు

పలాస: పలాసలో గత ప్రభుత్వం కిడ్నీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసిందని, ఆ ఆస్పత్రిలో ఇప్పుడు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేరని, వెంటనే నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల మృత్యుఘోష ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. ఈ ఆస్పత్రిలో మొత్తం 60 మంది వైద్యులకు గాను 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గతంలో 108 వాహనం ద్వారా డయాలసిస్ కేంద్రానికి వ్యాధిగ్రస్తులను తీసుకువచ్చేవారని, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెఫ్రోప్లస్ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రం నడుస్తోందని, అందులో సరిపడే బెడ్స్ లేక కిడ్నీ వ్యాధిగ్రస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డయాలసిస్‌కి వచ్చేవారు బయట రూ.1600కు కిట్లు కొనుక్కునే దుస్థితి ఉందన్నారు. పరిశోధనకు కావాల్సిన వైద్య సిబ్బందిని కూడా నియమించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కోనారి మోహనరావు, సంగారు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

నందిగాం: పోతులూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలపై సుబ్బమ్మపేట వెళ్లిన కమ్మకట్ల రాజు దంపతులను గ్రామస్తులు శనివారం దుశ్శాలుతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రాజు మాస్టార్ పాఠశాల అభివృద్ధికి పాటు పడటంతో పాటు గ్రామం నంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులకు వెళ్లకుండా తనవంతు కృషి చేశారని గుర్తుచేశారు. సర్పంచ్ తమిరె రాజు, బలరాం, నర్సింహులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ కార్యవర్గం నియామకం

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గం నియామకమైంది. శ్రీకాకుళంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడుగా పూండికి చెందిన యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, ఉపాధ్యక్షునిగా గొరకల సునీల్, కార్యదర్శిగా గున్న వెంకటనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా చింత అపర్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోడి నిహాల్, జాయింట్ సెక్రటరీగా కర్ని లింగరాజును ఎనుకున్నారు.

దివ్యాంగుల ధర్నా రేపు

టెక్కలి: దివ్యాంగుల సమస్యలపై 18వ తేదీన టెక్కలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పి.మోహన్ శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన సదరం రీ వెరిఫికేషన్‌లో భాగంగా సర్టిఫికెట్లు రద్దయిన దివ్యాంగులంతా సదరం సర్టిఫికెట్ ఆధార్, రీ వెరిఫికేషన్ జిరాక్స్ పత్రాలతో ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోవాలని సూచించారు.

గోకుల కృష్ణా..గోపాల కృష్ణా..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తులు శనివారం సంప్రదాయబద్ధంగా..వైభవంగా జరుపుకున్నారు. ఊరూరా ఆధ్యాత్మికశోభ నెలకుంది. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే సంబరంలో చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా పాల్గొని సందడి చేశారు. సాయంత్రం భజనలు చేస్తూ తిరువీధి చేపట్టారు. చిన్నారులంతా చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఊయలలో ఊగుతూ మురిసిపోయారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


టెక్కలి: రోటరీనగర్ శాంతి సుధా మందిరం వద్ద చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు


టెక్కలిలో ఉట్టి కొట్టే సంబరంలో చిన్నారులు


కంచిలి: రాధాకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప తదితరులు


కంచిలి బీసీ వసతి గృహం ఆవరణలో ఉట్టికొట్టే సంబరంలో విద్యార్థులు


ఇచ్ఛాపురం: బాలబ్రహ్మేనందసరస్వతి ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు


సోంపేట: బెంకిలిలో పూజలందుకున్న కృష్ణుడు


సోంపేటలో గోపిక, గోపాలకృష్ణుని వేషధారణలో చిన్నారులు


నందిగాం: పోతులూరు శ్రీకృష్ణ మందిరంలో భక్తుల పూజలు


కవిటి: ఇద్దివానిపాలెంలో సామూహిక కుంకుమార్చనలు


పలాస: నటరాజ్య నాట్య అకాడమి ఆధ్వర్యంలో కృష్ణష్టమి సందడి


కవిటిలో ఉట్టికొట్టే సంబరం


ఇచ్ఛాపురం రూరల్: టిబరంపురంలో కృష్ణాష్టమి వేడుకలు

వాహనాల తనిఖీ

టెక్కలి రూరల్: మద్యం తాగి వాహనాలు నడపరాదని టెక్కలి ఎస్సై రాము అన్నారు. శనివారం స్థానిక తెంబూర్ రోడ్డులో ఎస్సై–2 రఘునాథరావుతో కలసి వాహన తనిఖీలు చేసి.. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రిపుల్, మైనర్ డ్రైవింగ్ చేసిన వారిని అదుపులో తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏఎస్సై వెంకటరమణ ఉన్నారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై రాము

దళితవాడలో టీటీడీ ధార్మిక ప్రచారం


దళితవాడలోని మహిళలతో టీటీడీ ప్రవచనకర్తలు

ఇచ్ఛాపురం రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టి.బరంపురంలో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక దళితవాడలోని మహిళలచే టీటీడీ ప్రవచనకర్తలు కుంకుమ పూజలు నిర్వహించి ధార్మిక ప్రవచనాలు తెలియజేశారు.

విద్యార్థులకు డైరీల వితరణ


డైరీలను అందజేస్తున్న దృశ్యం

పలాస: డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లండ గురుమూర్తి, సుధారాణి దంపతులు చదువుకు ఉపయోగపడే డైరీలను వితరణగా శనివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు లంకపల్లి సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం!


తలగాం రోడ్డులో ఏర్పడిన గోతులు

టెక్కలి: టెక్కలి మండలం తలగాం గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వంసమవుతుంది. మూలపేట పోర్టుకు మెటీరియల్ తరలిస్తున్న భారీ వాహనాలు పరిమితికి మించిన లోడుతో.. మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు ఛిద్రంగా మారి గోతులమయమవుతుంది. గతంలో ఈరోడ్డు అధ్వానంగా ఉండేది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చారు. ఇప్పుడు భారీ వాహనాల కారణంగా రోడ్డు ధ్వంసం అవుతుండడంతో ప్రజలు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

కుక్కలతో భయం భయం..!


ఇరుకుసందులో కూడా సంచరిస్తున్న శునకాలు


మందస ప్రధాన వీధిలో గుంపుగా ఉన్న కుక్కలు

మందస: వీధికుక్కలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి పగలనే తేడాలేకుండా యథేచ్ఛగా సంచరిస్తూ జనంపై దాడులకు పాల్పడుతున్నాయి. మందస మండలంలోని పలు పంచాయతీల్లో ఈ పరిస్థితి ఉంది. అయితే ప్రధానంగా మండల కేంద్రం.. మందస మేజర్ పంచాయతీలో శునకాల భయం స్థానికులను మరింత వణికిస్తోంది. రోడ్ల మధ్యలో తిష్టవేస్తూ వచ్చిపోయే ద్విచక్ర వాహనాలు, కార్లను వెంబడిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు కుక్కలు వెంబడించే సమయంలో తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి పడిపోయి గాయపడుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు. ఇటీవల పలువురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సందర్భాలు చోటుచేసుకున్నాయి. దీంతో చీకటిపడితే ఇళ్లకే పిల్లలు పరిమితమవుతున్నాయి. మేజర్ పంచాయతీ అధికారులు దృష్టిసారించి కుక్కల నియంత్రణపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాలను వెంబడిస్తున్నాయి



మందసలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గట్టిగా అరుస్తు వాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టిసారించి కుక్కలను నియంత్రించాలి.

– గుజ్జు ప్రసాద్, మందస

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రోడ్లపై కుక్కలు తిష్ట వేసి ప్రజలను భయపెడుతున్న విషయం వాస్తవమే. కుక్కల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జరిగిన పంచాయతీ సమావేశంలో కూడా చర్చించాం. కుక్కల నియంత్రణ కోసం త్వరలోనే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

– బమ్మిడి నవీన్‌కుమార్, ఈవో, మందస మేజర్ పంచాయతీ